క్లుప్తంగా

ఘన వ్యర్థాల రహితంగా గ్రామాలను తీర్చిదిద్దాలి



సత్తెనపల్లి: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఘన వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దాలని సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నందిగామలో ఉన్న సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్ (మోడల్ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్)లో నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల డిప్యూటీ ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శనివారం శిక్షణ ఇచ్చారు. దీనిని ప్రారంభించాక ఆయన మాట్లాడారు. లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ఎలా కృషి చేయాలో సూచించారు. స్వచ్ఛత కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు. సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రత బాట పట్టాలని పిలుపునిచ్చారు. సత్తెనపల్లి డిప్యూటీ ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛత లక్ష్యాలను చేరుకోవడంలో ప్రజల పాత్ర కూడా కీలకమన్నారు. ముప్పాళ్ళ డిప్యూటీ ఎంపీడీఓ రూపవతి మాట్లాడుతూ బిన్ – బ్యాగ్ విధానంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. నకరికల్లు ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓ కేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వర్మి కంపోస్టు తయారీ గురించి వివరించారు. నందిగామ పంచాయతీ కార్యదర్శి కుంభ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఐటీసీ రీసోర్స్‌పర్సన్ సీహెచ్ బొల్లయ్య మాట్లాడుతూ నందిగామను పారిశుద్ధ్య కార్యక్రమాల్లో మోడల్ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దిన తీరు వెల్లడించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



నకరికల్లు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జి.కాశయ్య సూచించారు. నకరికల్లులో చేపట్టిన శుభ్రతా పనులను శనివారం ఆయన పర్యవేక్షించారు. వర్షాల కారణంగా సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని పేర్కొన్నారు. దుకాణాలు, గృహ సముదాయాల వద్ద వ్యర్థాలను నిర్దిష్ట ప్రదేశంలో పడేసేలా చూసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో వ్యర్థాల తొలగింపు, మురుగునీటి పారుదల క్రమబద్ధీకరించడం వంటి పనులను నిత్యం పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన




మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో పి.రత్నం శనివారం పరిశీలించారు. కూలీలకు కల్పించిన వసతుల గురించి తెలుసుకున్నారు. వారి సమస్యలపై ఆరా తీశారు.మండలంలోని 11 గ్రామాల్లో 1,075 మంది కూలీలు పనులకు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. వెంట ఏపీఓ ఏడుకొండలు, టెక్నికల్ అసిస్టెంట్ హనుమంతురావు, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ



అచ్చంపేట: గుర్తుతెలియని వ్యక్తులు 25కేవీ వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్, ఆయిల్ చోరీ చేశారు. ఈ ఘటన మండలంలోని కోగంటివారిపాలెం పొలాలలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద తేళ్లూరి కోటిరెడ్డి, పిండి కొండలు, గుడిశా చిన నర్సిరెడ్డి, మర్యాద కృష్ణారెడ్డి, బోనం నాగిరెడ్డిలకు చెందిన సుమారు 20 ఎకరాలకుపైగా వ్యవసాయ భూములున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు రైతులు పనులు చేసుకుని ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం వెళ్లేసరికి చోరీ విషయం వెలుగుచూసింది. పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు చేపడతామని విద్యుత్తు అధికారులు తెలిపినట్లు రైతులు చెప్పారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి



క్రోసూరు: స్థానిక నాలుగు రోడ్ల సెంటర్లో మురుగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు పేర్కొన్నారు. శనివారం సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి, నిరసన తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారికి సమస్యను ఫోన్లో వివరించారు. రవిబాబు మాట్లాడుతూ.. నెలల తరబడి మురుగు నీరు పారుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కార్యాలయానికి సమీపంలోనే ఈ ప్రాంతం ఉన్నా సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

అద్దెలు భారం.. వసతులు దూరం

- అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు
- అరకొర సౌకర్యాలతో చిన్నారులు, గర్భిణులకు అవస్థలు
- అద్దె ప్రాతిపదికన ప్రయివేటు భవనాల్లో 157 కేంద్రాలు నిర్వహణ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సొంత భవనాల నిర్మాణానికి చర్యలు
- కొన్నిచోట్ల చివరి దశలో నిర్మాణాలున్నా పట్టని కూటమి సర్కార్
- సకాలంలో అద్దె బకాయిలు కూడా విడుదల కాక కార్యకర్తలకు కష్టాలు

చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, పేద గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించారు. పాలకుల నిర్లక్ష్యంతో కేంద్రాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కేంద్రాలను నిర్వహిస్తుండటంతో సరైన వసతులు ఉండటం లేదు. అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె బకాయిలు సకాలంలో చెల్లించకపోతుండటంతో సిబ్బంది అప్పులు చేసి చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'నాడు–నేడు' ద్వారా చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం వచ్చాక కొద్దిపాటి నిధుల కేటాయింపు లేక నిరుపయోగంగా మారాయి.

ముప్పాళ్ళ: కనీస సౌకర్యాలు లేని అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటుగా నాణ్యమైన చదువు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవనాలు నిర్మించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలున్నాయి. సొంత భవనాలు లేకపోవడంతో



మాదలలో ఓ ఇంట్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

కార్యకర్తలే భవనాలకు అడ్వాన్స్‌లు చెల్లించి కేంద్రాలను నడుపుకొనే దుస్థితి దాపురించిందని సిబ్బంది వాపోతున్నారు.

అరకొర వసతులే దిక్కు

నియోజకవర్గంలోని ఆయా కేంద్రాలలో ఏడాదిలోపు 1,589 మంది, మూడేళ్లలోపు 6,904 మంది, ఆరేళ్లలోపు 4,094 మంది పిల్లలు ఉన్నారు. వీరితోపాటుగా గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్డుతోపాటు భోజనం అందిస్తున్నారు. కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక లబ్ధిదారు లు ఇబ్బందులకు గురవుతున్నారు. అద్దె భవనాల్లో నిర్వహించడం వలన సరుకులు నిల్వ ఉంచడానికి, వంట చేయడానికి, చిన్న పిల్లలకు మాట, నడక, ఆట, పాటలు నేర్పించడానికి వీలు లేని పరిస్థితి నెలకొంది. పిల్లలకు చదువు చెప్పాలంటే కనీసం మూడు గదులైనా ఉండాలి. అలాంటి అద్దె భవనం దొరకాలంటే అద్దెలు భారీగా చెల్లించాల్సి ఉంటుంది. అదే రీతిలో అడ్వాన్స్ చెల్లింపు ఉండటంతో వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి.

నియోజకవర్గంలో పరిస్థితి ఇదీ...

సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 303 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 93 కేంద్రాలు సొంత భవనాలు కాగా, మిగిలిన వాటిల్లో 53 భవనాలలో కేంద్రాలు దాతల సాయంతో కొనసాగుతున్నాయి. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న తరగతి గదిలో కొనసాగిస్తున్నారు. 157 కేంద్రాలు ప్రయివేటు భవనాల్లోనే అద్దె ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. పట్టణాల్లో భవనం అద్దెకు ఇచ్చేందుకు అడ్వాన్స్ తీసుకుంటుంటారు. ఎంతో కొంత చెల్లిస్తే తప్ప అద్దెకు ఇవ్వరు. అడ్వాన్స్‌గా తక్కువలో తక్కువగా రూ.20 వేలు వరకు చెల్లించాల్సిన పరిస్థితి. కేంద్రాలకు సొంత భవనాలు లేక పోవడంతో ప్రతి నెల పట్టణంలో రూ.5 వేల నుంచి రూ.6 వేలు, గ్రామీణ ప్రాంతంలో రూ.2 వేలు వంతున అద్దె చెల్లించాల్సి వస్తోంది. సకాలంలో అద్దె చెల్లించకపోతే ఖాళీ చేయాల్సిందేనంటూ యజమానులు ఒప్పందం చేసుకొని మరీ ఇస్తారు. కేంద్రం అద్దెతోపాటుగా పిల్లలకు అందించే ఆహారం తయారీకి అవసరమైన వస్తువులకు బిల్లులు కూడా మూడు, ఆరు నెలలకొకసారి వస్తున్నాయి. దీంతో అప్పులు చేసి కేంద్రాలను నడపాల్సి వస్తోందని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

నిలిచిన భవన నిర్మాణాలు...



ముప్పాళ్ళలో నిర్మాణం చివరి దశలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా మౌలిక వసతులను కల్పించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు ద్వారా శాటిలైట్ సెంటర్‌గా కొత్త భవనాల నిర్మాణాలు చేపట్టింది. మండలానికి ఒక కేంద్రం చొప్పున ముప్పాళ్ళ, నకరికల్లు, రాజుపాలెం మండలాలకు మంజూరు చేసింది. మరికొన్ని చోట్ల పాఠశాలల్లోనే ఒక గదిని కేటాయించింది. కేంద్రం నడపడానికి అన్ని వసతులను కల్పించి నిర్వాహకులకు అప్పగించింది. మరికొన్నింటికి కొత్త భవన నిర్మాణాలను చేపట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. శ్లాబ్ లెవల్ పూర్తి చేసుకున్నా ఫ్లోరింగ్, విద్యుత్ సదుపాయం వంటి చిన్న చిన్న పనులు పూర్తి కాక వినియోగించుకోలేని పరిస్థితి ఉంది. ఆ పనులు పూర్తి చేస్తే వినియోగంలోకి వస్తాయి. కొంత వరకు సమస్య తీరుతుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఇంత వరకు నిలిచిపోయిన నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సమస్యల మధ్యే బాల్య విద్య కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది.

సొంత భవనాలు నిర్మించాలి

అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేకపోవడంతో బాధాకరం. ప్రధానంగా పట్టణాల్లో భవనాన్ని అద్దెకు అడిగితే అడ్వాన్స్‌లు చెల్లించాల్సిందే. దీంతో కేంద్రాల నిర్వహణ భారంగా మారింది. కొన్ని చోట్ల అడ్వాన్స్‌లు ఇచ్చి కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం కూడా ప్రతి నెలా ఒకటో తేదీనే అద్దె అందిస్తే కొంత వెసులుబాటు ఉంటుంది. చాలీచాలని జీతాలతో సర్దుబాటు చేసుకుంటూ కార్యకర్తలు కాలాన్ని వెళ్లదీస్తున్నారు. సొంత భవనాలను నిర్మిస్తే ఇబ్బందులు తొలుగుతాయి. గతంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాల్సిన అవసరం కూడా ఉంది.

– గుంటూరు మల్లీశ్వరి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి

ప్రతిపాదనలు పంపాం

సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 54 భవనాలను కొత్తగా నిర్మించాలని శాఖాపరంగా గుర్తించాం. ఈ మేరకు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు ఇప్పటికే పంపించాం. నాబార్డ్ ద్వారా 40 కేంద్రాలు, ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మరో 14 కొత్త కేంద్రాలను నిర్మించేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరాం. గతంలో నిర్మాణం చేపట్టి ఆగిపోయిన భవన నిర్మాణాలు పూర్తి చేయాలంటూ అధికారులకు నివేదికలు పంపాం. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

– శ్రీలత, సీడీపీఓ , ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్

దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



సత్తెనపల్లి: పురోహితుడు పాతూరి సాయికృష్ణశర్మను అసభ్య పదజాలంతో దూషించి దాడికి యత్నించిన ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు కొండలుపై చర్యలు తీసుకోవాలని వేద గాయత్రి పురోహితుల బ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావును శనివారం వారు కలిసి జరిగిన ఘటనను వివరించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్పీ హనుమంతురావు సూచనల మేరకు సత్తెనపల్లి టౌన్ సీఐ నాగమల్లేశ్వర రావును నాయకులు కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం, అత్యవసర సమావేశం ఈ నెల 30న ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన జరగనుంది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్‌కుమార్ శనివారం తెలిపారు. అజెండాలోని అంశాలపై చర్చించి, ఆమోదించటం జరుగుతుందన్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ముప్పాళ్ళ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 29వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం జరుగుతుందని పూర్వ విద్యార్థులు శనివారం తెలిపారు. ఉదయం 8 – మధ్యాహ్నం ఒంటి గంట వరకు నరసరావుపేటకు వైద్యులు ఉచిత కంటి, షుగర్, బీపీ, కీళ్ళ నొప్పుల పరీక్షలు చేస్తారన్నారు. తాడువాయి జగన్నాధం, ధనలక్ష్మి జ్ఞాపకార్థం శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు శ్రీ గురు పూజోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో శ్రీ గురు పూజోత్సవం జరగనుంది. ఈ మేరకు ఖండ సంఘ చాలక్ చలువాది చిన్న సత్యనారాయణ శనివారం తెలిపారు. ముఖ్య అతిథిగా బాలాజీ ఫీ స్వీట్స్ అధినేత తెంటు బాలాజీ, ప్రధాన వక్తగా గుంటూరు విభాగ్ శారీరిక్ ప్రముఖ్ దామెర్ల నరసింహారావు హాజరు అవుతారన్నారు.

కొనసాగిన దొడ్లేరు సీజీజీబీ గోల్డ్ బాధితుల ఆందోళన

బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన



బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో గల దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు (సీజీజీబీ)లో 22 మాసాల క్రితం బంగారం గోల్‌మాల్ అయిన నేపథ్యంలో బాధితులు నేటికీ న్యాయం కోసం పోరాడుతున్నారు. బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వారు చేపట్టిన ఆందోళన శనివారం రెండవ రోజుకు చేరింది. బ్యాంకు ఎదుటే వారి ఆందోళన కొనసాగింది. ఏపీ రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళన సందర్భంగా జిల్లా కౌలు రైతు సంఘం ప్రతినిధి తిమ్మిశెట్టి హనుమంత రావు మాట్లాడారు. బాధితులు మొత్తం 520 మంది ఉండగా, వారిలో ఇంకా 130 మందికి సమస్య పరిష్కారం చేయాల్సి ఉందని తెలిపారు. అయినప్పటికీ బ్యాంకు అధికారులు ఎటువంటి సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బాధితుల సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా బంగారం పోయిన బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై దొడ్లేరు సీజీజీబీ మేనేజరు బి.శివశంకర్ స్పందిస్తూ.. 'ఈ సమస్యల పరిష్కారం బాధ్యతను రీజినల్ బ్యాంకు అధికారులు చూస్తున్నారు. త్వరలోనే అన్ని ఇబ్బందులను పరిష్కరిస్తారు. ప్రస్తుతం నేను ఈ విషయంలో ఏమీ చెప్పలేన'ని పేర్కొన్నారు.

బ్యాంకు లెక్కల్లో నమోదు కాలేదు



నేను 24 గ్రాముల కాసుల దండ తాకట్టు పెట్టాను. అప్రైజర్ నాగార్జున రశీదు ఇచ్చాడు. బ్యాంకు లెక్కల్లో మాత్రం నమోదు చేయలేదు. రూ.60 వేలు రుణం తీసుకున్నాను. ఇప్పుడు బ్యాంకు అధికారులు తమ పుస్తకాల్లో ఈ వివరాలు లేవని, తమకు సంబంధం లేదని చెబుతున్నారు. ఇదెక్కడి అన్యాయమో అర్థం కావడం లేదు.

– తరిమెళ్ల శేషంరాజు, కొండూరు గ్రామం, అచ్చంపేట మండలం

నాలుగు వస్తువులు మిస్ అయ్యాయి



నేను బ్యాంకులో 2019లో ఆరు బంగారు వస్తువులు మొత్తం 57 గ్రాములు బరువు కలిగినవి తాకట్టు పెట్టాను. ఇప్పుడు నా పేరిట రెండు వస్తువులు మాత్రమే ఉన్నాయంటున్నారు. నాలుగు వస్తువులు మిస్ అయ్యాయి. నా దగ్గర అన్ని రకాల ఆధారాలు ఉన్నాయి. బ్యాంకు అధికారులు మాత్రం తమ సంబంధం లేదని అంటున్నారు. వడ్డీ కూడా కట్టించుకున్నారు. న్యాయం చేయాలి.

– యర్రంశెట్టి వీరయ్య, దొడ్లేరు గ్రామం, క్రోసూరు మండలం

వైఎస్సార్‌సీపీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నియోజకవర్గంలోని ఐదు మండల పార్టీ కమిటీలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పెదకూరపాడు నియోజకవర్గ సమన్వయకర్త నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండల పార్టీ కమిటీలను ప్రకటించామని చెప్పారు. బూత్ స్థాయి నుంచి గ్రామ, మండల స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసేలా కమిటీలు పనిచేయాలని కోరారు. నూతనంగా ఎంపికైన కమిటీలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన అబద్ధపు హామీలను ప్రజలలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీలో ప్రతి కార్యకర్తను గుర్తించి సరైన ప్రాధన్యత ఇవ్వాలన్నారు. గ్రామ స్థాయిలో కూడా కమిటీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

అన్నిస్థాయిల్లో బలోపేతం చేస్తాం

పెదకూరపాడు: వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని పెదకూరపాడు ఎంపీపీ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా ఎంపికైన బెల్లంకొండ మీరయ్య అన్నారు. పెదకూరపాడులో ఆయన శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావం నుంచి విధేయుడిగా పని చేశానని తెలిపారు. అధికారంలో ఉన్నా లేకున్నా మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నమ్మిన బంటుగా పార్టీకి పని చేశానని చెప్పారు. బూత్, గ్రామ, మండల స్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల సహకారంతో పూర్వవైభవం తెస్తామని తెలిపారు.

భవిరిశెట్టికి శ్రేణుల అభినందనలు

అమరావతి: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా సేవలు అందించిన భవిరిశెట్టి హనుమంత రావును పార్టీ అధిష్టానం రెండోసారి అదే పదవిలో నియమించడంతో శనివారం ఆయన్ను పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ సందర్భంగా భవిరిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ శాసనసభ్యుడు నంబూరు శంకరరావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండడలంలో కార్యకర్తలను, నాయకులను సమన్వయం చేసుకుని పార్టీని మరింత బలోపేతం చేస్తానని చెప్పారు. హనుమంత రావును అభినందించిన వారిలో జిల్లా పంచాయతీ రాజ్ విభాగ అధ్యక్షుడు అలా లక్ష్మీనారాయణ, జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు నాయుడు సాంబశివ రావు, ఎండ్రాయి గ్రామ సర్పంచ్ నాయుడు రాంబాబు, పార్టీ నాయకులు అలపాటి వీరయ్య, పాపారావు, దారా ప్రసాద్, తోకల సూరిబాబు, శేషారావు, ఫిలిప్స్, విన్నకోట వాసు, పోతురాజు తదితరులు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే



విద్యార్థులతో సుబ్బారావు తదితరులు

పెదకూరపాడు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపైనా శ్రద్ధ పెట్టాలని ఆడిట్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్, పూర్వ విద్యార్థి కొర్లకుంట సుబ్బారావు అన్నారు. పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి షేక్ అక్బర్ సహకారంతో 40 మంది హాకీ, వాలీబాల్ క్రీడాకారులకు రూ.25 వేల విలువ చేసే క్రీడా దుస్తులను శనివారం పంపిణీ చేశారు. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, పూర్వ విద్యార్థి షేక్ బాలిసైద్ మాట్లాడుతూ 1981–86 పూర్వ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కాకాని వెంకటరమణ, పూర్వ విద్యార్థులు మోదేపల్లి రమాదేవి, వి. శ్రీనివాసరెడ్డి, చిల్లపల్లి సత్యం, మంచినీళ్ల శ్రీధర్, వి.కుంచనపల్లి హనుమంతరావు, కొమ్మినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లోడు ట్రాక్టర్లతో పొంచి ఉన్న ప్రమాదం



రాజుపాలెం: మండలంలోని కొండమోడు క్వారీల నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లు పిడుగురాళ్ల సమీపంలోని ముగ్గు మిల్లులకు రాళ్లను నిత్యం తోలుతున్నాయి. అధిక లోడుతో హైవేపై అతివేగంగా వెళుతుండటంతో వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు, పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



సమ్మెను జయప్రదం చేయాలని కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

నరసరావుపేట ఈస్ట్: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జులై 9వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పల్నాడు జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు తెలిపారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరు తూ శనివారం చిత్రాలయ సెంటర్‌లోని ఆయిల్ మిల్లుల కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తు కార్మిక హక్కులను హరించి వేస్తున్నదని తెలిపారు. దేశ సంపదను అంబానీ, అదానీలను దోచిపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, సత్యనారాయణ రాజు, సి.హెచ్.నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు షేక్.చినజాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకంతో అనర్థాలపై అవగాహన



బహుమతులు అందిస్తున్న వైద్యసిబ్బంది



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

పెదకూరపాడు: పొగాకు వాడకం క్యాన్సర్‌కు కారణమని 75 త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పొగాకు నివారణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ దిలీప్‌కుమార్‌లు మాట్లాడుతూ పొగాకు వాడకం వల్లన కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు వారు బహుమతులు ప్రదానం చేశారు.

క్రోసూరు: క్రోసూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు జి.రాము, ఎస్ఎఫ్‌సీ మనోజ్ఞ, సీహెచ్ షాలోమ్‌లకు పీహెచ్‌సీ వైద్యధికారి డాక్టర్ సిరిచందన, ప్రధానోపాధ్యాయులు జి రామాంజనేయులు, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ బ్యాగులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు దుగ్గి బాబురావు, ఆరోగ్య కార్యకర్త లావణ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో నష్టాలపై అవగాహన



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

బెల్లంకొండ: మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డా.కిరణ్ కుమార్, డా.దీపికలు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మణికుమారి, సూపర్‌వైజర్ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.